

మేడపాడు మాజీ సర్పంచి ప్రసాద్ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు, యలమంచిలి

యలమంచిలి మండలం మేడపాడు మాజీ సర్పంచి, సొసైటీ మాజీ అధ్యక్షులు అడ్డాల మోహన్ రంగ ప్రసాద్ (67) మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన దీర్ఘకాల వ్యాధితో బాధపడుతున్నారు. 1988-95 కాలంలో పంచాయతీ సర్పంచిగా, 1995-2022 మధ్య సొసైటీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రసాద్ తండ్రితో పాటు ఆయన సోదరుడు అడ్డాల వాసు భార్య కూడా సర్పంచిగా పనిచేసి మేడపాడు గ్రామాభివృద్ధికి కృషి చేశారు.



కోడలమ్మ పద్దు.. ఫలికేనా..!



నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్
'పోలవరం'కు నిధులిస్తేనే నిర్వాసితులకు మేలు
రైల్వేలైన్లకు నిధుల కేటాయింపులు సంగతేమిటో
కష్టాల కడలిలో ఆక్వా, వ్యవసాయ సాగు

కర్షకుల కన్నీటి వ్యథలు.. వేతన జీవులకు ఆదాయపు పన్ను కష్టాలు.. నిధుల్లేక పోలవరం నిర్వాసితుల పరిహారపు వెతలతోపాటు జిల్లాలోని కేంద్ర విద్యాసంస్థ నిట్‌కు, కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు నిధుల కేటాయింపునకు సంబంధించి నేడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో మోక్షం కలిగేనా అనే టెన్షన్ అందరినీ వెంటాడుతోంది. మోడీ సర్కార్ ఎనిమిదేళ్లుగా జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులను పట్టించుకోకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారయ్యాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల గోడు కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. కేంద్రం ఆధ్వర్యంలో నడిచే పోలవరం ప్రాజెక్టు జిల్లాలోనే నిర్మితమవుతోంది. దీనికి పూర్తిస్థాయిలో నిధులు కేంద్రమే ఇస్తుందని రాష్ట్రవిభజన చట్టంలో సైతం పొందుపర్చారు. కేంద్రం మాత్రం పోలవరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోంది. దీంతో నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 126 గ్రామాలను ఖాళీ చేయించాల్సి ఉంది. దీంతో 25,600కుపైగా కుటుంబాలను తరలించాలి. నిర్వాసితులందరికీ ఇళ్లు, భూమికిభూమి, యువతకు పరిహారం, పునరావాస ప్యాకేజీ వంటివి ఇవ్వాల్సి ఉంది. దీంతో పోలవరం నిర్మాణానికి మొత్తం రూ.52 వేల కోట్లు వరకూ ఖర్చు కానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ఇప్పటికీ ప్రతిపాదనలకు ఆమోదం తెలపలేదు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చులో ఇంకా రూ.2,400 కోట్లు కేంద్రం నుంచి రాని పరిస్థితి ఏర్పడింది. గడిచిన వర్షాకాలంలో విరుచుకుపడిన గోదావరి వరదలకు ముంపు గ్రామాలన్నీ జలమయమయ్యాయి. నెలలు తరబడి పునరావాస శిబిరాల్లో నిర్వాసితులు తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. 45.75 కాంటూరు పరిధి వరకూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలంటే కేంద్రం నిధులిస్తేనే సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలంటే రూ.30 వేల కోట్లు వరకూ ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పోలవరానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తేనే నిర్వాసితులకు న్యాయం జరుగుతుంది. అంతేకాకుండా వరదల కారణంగా డయాఫ్రం వాల్ కోతకు గురై దెబ్బతింది. దీంతో ప్రాజెక్టు పనులు సైతం పడకేశాయి. కేంద్రం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి నిర్వాసితులకు న్యాయం చేయడంతోపాటు ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంది. డయాఫ్రంవాల్ దెబ్బతినడాన్ని బూచిగా చూపి నిధుల కేటాయింపు నుంచి కేంద్రం తప్పించుకునే అవకాశం ఉందనే వాదనతో సర్వత్రా టెన్షన్ నెలకొంది.

రైల్వేలైన్లకు మోక్షం కలిగేనా

జిల్లాలో దశాబ్దాల నాటి కలగా కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్లు ఉన్నాయి. కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్‌ను కొవ్వూరు-సత్తుపల్లి రైల్వేలైన్‌గా మార్చనున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్‌లో దీనికి సంబంధించి ప్రస్తావన ఉంటుందో లేదో వేచిచూడాలి. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు సంబంధించి సైతం నిధుల కేటాయింపు జరిగితేనే దీనికి మోక్షం లభిస్తుంది.

'నిట్'కు నిధులిచ్చేనా..?

రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర విద్యాసంస్థ నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ను తాడేపల్లిగూడెంలో నిర్మించారు. నిట్‌కు సంబంధించి ఇప్పటి వరకూ ఫేజ్-1 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఫేజ్-2 పనులకు సంబంధించిన పనులకు రూ.738 కోట్లు వరకూ ఖర్చు కానున్నట్లు నిట్ యాజమాన్యం ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రానికి పంపించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.230 కోట్లు వరకూ పనులు చేయాల్సి ఉంది. బడ్జెట్‌లో నిధులిస్తేనే నిట్ విద్యాసంస్థ అభివృద్ధి ముందుకు సాగుతుంది. విద్యార్థులకు అవసరైన సౌకర్యాలు ఏర్పడతాయి. ఈసారి బడ్జెట్‌లో నిట్‌కు నిధులు కేటాయిస్తారా లేదో చూడాలి. జిల్లాలోని ఉద్యాన యూనివర్సిటీ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల కేటాయింపు సరిగా జరగడం లేదు. ఈసారి బడ్జెట్‌లోనైనా నిధులు విడుదల కేటాయించాల్సి ఉంది.

ఆదాయపు పన్ను శ్లాబ్ పెంపుపై వేతన జీవులు ఎదురుచూపు

ఏడాదికి రూ.2.50 లక్షల వరకూ ఉన్న ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతన జీవులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. బడా పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు కల్పిస్తున్న మోడీ సర్కార్ వేతన జీవుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఈసారి బడ్జెట్‌లోనైనా ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు.

ఆక్వా, వ్యవసాయ రంగాలకు అండగా నిలిచేనా

జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. ప్రతియేటా రూ.15 వేల కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. విదేశీ మారకద్రవ్యం పెద్దఎత్తున తెచ్చిపెడుతున్న వాటిలో ఆక్వా సాగు ఒకటి. అలాంటి ఆక్వారంగానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమాత్రం మద్దతు లేకుండాపోయింది. మేత ధరలు విపరీతంగా పెంచేసింది. ధర విషయంలో నిలకడ లేకపోవడంతో వంద కౌంట్ సైతం రూ.200లోపే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆక్వా పరిశ్రమకు చేయూత విచ్చేవిధంగా బడ్జెట్‌లో నిర్ణయాలు జరగాలని ఆక్వా రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గడిచిన ఏడాదిలో ఎరువుల ధరల 50 కిలోల బస్తా ఏకంగా రూ.1700కుపైగా చేరిపోయింది. పురుగుమందుల ధరల పరిస్థితి అదేవిధంగా ఉంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. మద్దతు ధర లేకుండాపోతుంది. ఎరువులకు సబ్సిడీ పెంచితే రైతులకు మేలు జరుగుతుంది. పామాయిల్ ధర పతనంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచేలా, మద్దతు ధర కల్పించేలా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మన జిల్లా కోడలు నిర్మలా సీతారామన్ జిల్లాలో అంశాలను పట్టించుకుంటారో.. లేదో మరికొద్ది గంటల్లో తెలియనుంది.

ప్రత్యేక హోదా కోసం మరో స్వాతంత్రోద్యమం

- విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి సమర యాత్రలో నేతల స్పష్టం
- కేశవరావు హైస్కూల్లో బహిరంగ సభకు పెద్దసంఖ్యలో హాజరైన విద్యార్థులు, యువత
- ప్రత్యేక హోదా ఇచ్చే వరకు పోరాటం: ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్
- భవిష్యత్తు ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు: సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం
- ప్రశ్నించకపోతే భవిష్యత్తు అంధకారం: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్
- భీమవరం వేదికగా ఉద్యమాలకు శ్రీకారం: డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము



ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం

'పార్లమెంటులో చట్టం చేశారు.. తిరుపతి వెంకన్న సాక్షిగా హామీలు గుప్పించారు.. ఎనిమిదిన్నరేళ్లు గడుస్తున్నప్పటికీ ఏఒక్కటీ అమలు చేయలేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే మరో స్వాతంత్రోద్యమానికి సన్నద్ధమవుతామని విద్యార్థి యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి సమర యాత్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై నోరు మెదపకుండా ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెడుతున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చింది. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని, మన్యంవీరుడు అల్లూరి స్ఫూర్తితో లక్ష్యాన్ని సాధిస్తామని ప్రతినబూనారు. ఈ నెల 25న హిందూపురంలో ప్రారంభమైన సమర యాత్ర 2.0 మంగళవారం జిల్లాలో ప్రవేశించింది. ఆకివీడు వద్ద ఈ యాత్రకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఈ యాత్ర బైక్ ర్యాలీతో ఉండి మీదుగా జిల్లా కేంద్రమైన భీమవరం చేరుకుంది. కొత్త బస్టాండ్ సెంటర్లో ఉన్న కేశవరావు హైస్కూల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనుష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేతలు అభివాదం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చాలని, విశ్వవిద్యాలయాలు స్థాపించాలని, ఆక్వా యూనివర్సిటీ పనులు ప్రారంభించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని నినదించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్ కోసం పోరాడుతున్న ఈ యాత్రకు అన్ని రాజకీయ పార్టీలూ కలిసి రావాలన్నారు. బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి కర్కశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పార్లమెంట్లో చట్టం చేసి, వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చి ఇప్పుడు కనీసం నోరు మెదపడం లేదని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు అల్లూరి స్ఫూర్తితో పోరాడతామని హెచ్చరించారు. గ్రంధి శ్రీనివాస్ భీమవరం ఎంఎల్ఎ కాకముందు రాష్ట్రాన్ని విడగొట్టొద్దని తనతోపాటు ఉద్యమించారని, అధికారం చేపట్టాక ఆయన, ఆయన పార్టీ మళ్లీ కన్పించలేదని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాకినాడ వచ్చి ప్రత్యేక ప్యాకేజీ పాచిపోయిన లడ్డూలని చెప్పడమే తప్ప బిజెపిని ప్రశ్నించలేదని ఆరోపించారు. ఆంధ్రుల ఆత్మగౌరవ సూచిక విశాఖ ఉక్కును ప్రయివేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఈ యాత్ర, భవిష్యత్తు ఉద్యమాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. రాష్ట్రంలో రోజురోజుకీ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతను చూసి ప్రభుత్వ పాలకులు సిగ్గుపడాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగం లేకపోతే భవిష్యత్తు విద్యార్థి, యువతకు ఉద్యోగాలు ఉండవన్నారు. ప్రశ్నిస్తానని చెప్పిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మోడీతో జతకట్టి మౌనం పాటిస్తున్నాడన్నారు. మోడీని చూడగానే జగన్, చంద్రబాబులకు ఒళ్లు చల్లబడిపోతుందని, పవన్‌కు ఒళ్లు పులకరించిపోతుందని వ్యాఖ్యానించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము మాట్లాడుతూ రాజకీయ పార్టీలు తమ రాజకీయ లబ్ధి కోసం పాదయాత్ర చేస్తుంటే తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం సమర యాత్ర చేస్తున్నామన్నారు. ఇటీవల దర్శిలో 22 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని, దీనికి ప్రభుత్వానిదే బాధ్యతని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకపోతే భీమవరం కేంద్రంగా ఉద్యమాలకు శ్రీకారం చూడటమని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్యాయంగా విడగొట్టి అప్పుడు కాంగ్రెస్, ఇప్పుడు బిజెపి తీవ్ర ద్రోహం చేశాయన్నారు. అల్లూరి జయంతి వేడుకకు భీమవరం వచ్చిన మోడీ హోదా, విభజన హామీలపై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలో విఫలమయ్యాయన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అధికార ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన విభజన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు ఐక్య ఉద్యమాలు చేపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, సామాజిక ఉద్యమకారిణి మనోహరమ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ సిహెచ్.పావని, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు టి.ప్రసాద్, వి.భాను, గర్ల్స్ కన్వీనర్ పి.మోహిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

డెల్టా నుంచి ప్రధాన నగరాలకు..
రైళ్లు నడిపేదెప్పుడో..!



ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు, నర్సాపురం, భీమవరం వంటి ప్రాంతాల నుంచి విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండటంతో రైల్వే ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. నరసాపురం-విజయవాడ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు పూర్తి కావడం, ప్రయాణ సమయం తగ్గడంతో ప్రయాణికులు రైలు ప్రయాణానికి మక్కువ చూపుతున్నారు. ఇప్పటికే ఉన్న రైళ్లలో టిక్కెట్లు దొరకకపోవడం తత్కాల్ టికెట్లు కూడా దొరకకపోవడంతో ఆర్‌టిసి బస్సులతోపాటు అనేక ప్రయివేట్ సర్వీసులు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నయ్ వంటి ప్రాంతాలకు నేరుగా వెళ్తున్నాయి. అయితే కోనసీమ జిల్లా నుంచి పాలకొల్లు, నర్సాపురం ప్రాంతాల వారు బెంగుళూరు, చెన్నయ్, ముంబై, ఢిల్లీ, కొల్‌కత్తా వెళ్లాలంటే నేరుగా రైలు సదుపాయం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వాహనాలపై తాడేపల్లిగూడెం, భీమవరం, విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని నరసాపురం నుంచి నేరుగా చెన్నయ్, బెంగుళూరు, ముంబై, న్యూఢిల్లీకి నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని డెల్టా, కోనసీమ ప్రజలు కోరుతున్నారు.

నర్సాపురం-కోటిపల్లి రైల్వేలైన్ నిర్మాణం ప్రారంభమైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. నరసాపురం ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం, సముద్రతీరం వెంబడి జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేస్తే జనానికి మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

ఇప్పటికే రాత్రివేళ్లలో నరసాపురం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వారం రోజుల ముందు కూడా టిక్కెట్ దొరకని పరిస్థితి ఉంది. ఆదివారం, పండుగ రోజుల్లో ప్రత్యేక రైళ్లు వేస్తున్నా వాటిలోనూ టిక్కెట్లు దొరకని పరిస్థితి ఉంది. నరసాపురం, పాలకొల్లు, భీమవరం నుంచి దాదాపు 30కు పైగా ఆర్‌టిసి బస్సులు హైదరాబాద్ రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో కూడా టిక్కెట్ దొరకకపోవడంతో దాదాపు 40కుపైగా ప్రయివేట్ బస్సులు హైదరాబాద్ వెళ్తున్నాయి. పగటిపూట హైదరాబాద్ వెళ్లేందుకు నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ఉంది. అయితే రాత్రి సమయంలో నరసాపురం నుంచి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, భీమవరం నుంచి విశాఖ ఎక్స్‌ప్రెస్ మాత్రమే ఉన్నాయి. రద్దీ రీత్యా నరసాపురం నుంచి మరో రైలు నడపాలని జనం చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ బడ్జెట్‌లో ఆ కల సాకారం అవుతుందో లేదో వేచిచూడాలి.


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పాఠశాలలో నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నిధుల దుర్వినియోగంపై అధికారులు మంగళవారం విచారణ చేశారు. పాఠశాలకు నాడు - నేడులో రూ.51.03 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయని, నిధులు దుర్వినియోగం అయ్యాయని పిఎంసి వైస్ ఛైర్మన్ చదలవాడ మణి, కొల్లాటి గోపాలకృష్ణ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష అభియాన్ డిఇ శక్తేశ్వరరావు, ఎంఇఒ వినాయకుడు, సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయ సూపరింటెండెంట్ ముజీబ్‌లు పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రంలో మద్యం ఏరులు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. ఐద్వా పట్టణ జనరల్ బాడీ సమావేశం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మద్యం ఏరులై పారుతోందని, మద్యం తాగి పురుషులు అనారోగ్యాలు పాలై మరణిస్తే ఆ కుటుంబ భారమంతా మహిళపైనే పడుతోందన్నారు. ఒంటరి మహిళలుగా కుటుంబాలను సాగలేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. మద్యాన్ని పూర్తిగా నియంత్రించకపోయినా మండలానికి ఒక షాపు పెట్టి నియంత్రించాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనులు 100 రోజులు చూపించకుండా, ధరలు నియంత్రించకుండా ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారని విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు ఆవిధంగా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించి 14 రకాల నిత్యావసర వస్తువులు అందిస్తోందని, మన ప్రభుత్వం ఎన్నికల జిమ్మిక్కులు చేస్తోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా కోటి సభ్యత్వంతో ఉన్న ఐద్వా సంఘం నిరంతర మహిళల సమస్యలపై పనిచేస్తోందని, సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ పోరాటాలకు మహిళలందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ 2023 సంవత్సరం సభ్యత్వాలు చేయించాలని, వార్డుల్లో వార్డు కమిటీలు వేసి వార్డు సమస్యలపై పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షురాలు పూర్ణిమ, కార్యదర్శి యశోద పద్మ, పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి

ఆచంట వేమవరంలో రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఆచంట

టార్గెట్ పూర్తయిందన్న సాగు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ విమర్శించారు. మంగళవారం ఆచంట వేమవరం, పోడూరు మండలం గుమ్మలూరు గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో ధాన్యం రాశులను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యాలు మాసూళ్లు జరిగి నెలా 15 రోజులైనా ఇంకా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతి గింజా కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో జరగడంలేదన్నారు. ఆర్‌బికె వద్దకు వెళ్లి అడగ్గా ఇంకా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందని పైఅధికారులకు తెలియజేశామని చెప్పారు. కొంత ధాన్యం మాత్రమే తీసుకుంటామని, ఇంకా నాలుగైదు మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోతుందని తెలిపారు. పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు, గుత్తుల రంగారావు, కొండేటి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగరాజు, నరసింహారావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఎస్‌వి.నరసింహమూర్తికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. కార్మికులకు పది నెలలుగా ఇవ్వాల్సిన కొబ్బరి నూనె, సబ్బులు, మూడు సంవత్సరాలుగా యూనిఫారాలులు, పాదరక్షలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇవేమీ అమలు చేయకుండా కార్మికులకు పనులు పురమాయించడం అన్యాయం అన్నారు. కార్మికులపై వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, కార్మిక సంఘం నాయకురాలు బంగారు విజయ పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు


మాజీ మంత్రి కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

మావుళ్లమ్మ సన్నిధిలో మాజీ మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం మావుళ్లమ్మను దర్శించుకున్నారు. ముందుగా టిడిపి నాయకులు మావుళ్లమ్మ దేవాలయం వద్ద రవీంద్రకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కృష్ణ బిజిజ సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ గంటా త్రిమూర్తులు గృహమంలో సత్కరించారు. అమ్మవారి దర్శనం అనంతరం కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 59 సంవత్సరాలుగా మావుళ్లమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించారు. రాష్ట్రంలో బిసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకుండా వారి సంక్షేమాన్ని జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ద్వాక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సగంచెరువులో కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఎఎన్ఎం కొయ్య నాగమణి పాఠశాల విద్యార్థులను, అంగన్వాడీ విద్యార్థులను పరీక్షించారు. వ్యాధి లక్షణాల గురించి వివరించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, కాళ్లు లేదా చేతులు కండరాల్లో బలహీనత మొదలైన లక్షణాలు ఉంటాయని తెలియజేశారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పంపన లక్ష్మీనారాయణ, యద్ద కళావతి, ఆశ రత్నకుమారి, అంగన్వాడీ టీచర్ శిరీష పాల్గొన్నారు.


బాలుడి పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న యడ్ల తాతాజీ

బాలుడి వైద్యానికి తాతాజీ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణానికి చెందిన చెవ్వేటి నరేంద్ర, సునీత దంపతుల కుమారుడు (4 నెలలు) లివర్ సంబంధిత సమస్య వచ్చింది. దీంతో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చికిత్స నిమిత్తం కొంత నగదు అందజేశారు. పెయింటింగ్ పని చేసుకునే నరేంద్ర తన ఆర్థిక పరిస్థితి బాగోలేని, పిల్లాడికి వైద్యం చేయించేందుకు డబ్బులు లేవని, సాయం అందించాలని తాతాజీకి ఫోన్‌లో కోరాడు. మంగళవారం తాతాజీ బాధితుడిని పరామర్శించి వైద్యానికి తగు ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. వారికి కొంత నగదు అందజేసి బాసటగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. తాతాజీ వెంట చెన్ను విజయ్, గంటా నరేష్, పెచ్చెట్టి కృష్ణాజీ, పాలపర్తి కృపనాథ్, త్సవటపల్లి కృష్ణమోహన్, దిద్దే చిట్టిబాబు, షేక్ వలీ, తెన్నేటి శ్యామ్యూల్ ఉన్నారు.

ఆకాశంలో ఆకుపచ్చ తోకచుక్క

వారం రోజుల్లో అద్భుతం : జెవివి

ప్రజాశక్తి - ఉండి

వినీలాకాశంలో ఎన్నో అద్భుతాలు దాగి ఉన్నాయి. అవి అప్పుడపుడూ మనల్ని ఆశ్చర్యపరుస్తూ ఉంటాయి. అలాంటి అరుదైన దృశ్యం మనం ఈ వారంలో చూడబోతున్నాం. వివరాలను జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు గాదిరాజు రంగరాజు మంగళవారం వెల్లడించారు. 50 వేల సంవత్సరాల కిందట ఆకాశంలో ఆకుపచ్చ తోకచుక్క కనిపించిందని, తిరిగి ఫిబ్రవరి మొదటివారంలో కనిపించనుందని తెలిపారు. ఈ తోకచుక్క 42 మిలియన్ల కిలోమీటర్ల సమీపానికి రానున్నట్లు అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తెలిపిందన్నారు. ఇది బృహస్పతి కక్షలో ఉండగానే గత ఏడాది మార్చిలో ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారని, అప్పటి నుంచి ఇది వెలుగులు విరజిమ్ముతూనే ఉందని తెలిపారు. భూమిపై జీవం ఎలా ఏర్పడిందో తోకచుక్క ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఆకుపచ్చ తోకచుక్కకు గ్రీన్ కామెట్‌గా శాస్త్రవేత్తలు నామకరణం చేశారని తెలిపారు. ఈ అద్భుత దృశ్యాన్ని ప్రతి ఒక్కరూ చూడాలని తెలిపారు.


మాట్లాడుతున్న ఎపియుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జయకుమార్

ఒపిఎస్‌ను అమలు చేయాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి - తణుకురూరల్

సిపిఎస్ ను వెంటనే రద్దు చేసి ఒపిఎస్ ను అమలు చేయాలని ఎపియుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని మంగళవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో తణుకు డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీకి అనుగుణంగా వెంటనే ఒపిఎస్ అమలు చేయాలన్నారు. హామీ అమలు కోరితే అక్రమ కేసులు బనాయిస్తూ ఉపాధ్యాయులను, ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సిపిఎస్ డివిజన్ కన్వీనర్ కె.కిరణ్‌కుమార్, జి.రవి, గౌతమ్‌రావు, దేవదత్తం, పివి భారతి, పిఎన్‌పికె ఉమాదేవి, కె.దుర్గ, డి.లావణ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పితాని పరామర్శ

ప్రజాశక్తి - పోడూరు

ఇటీవల కాలంలో మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మంగళవారం పరామర్శించారు. కవిటం గ్రామానికి చెందిన సర్పంచి చుట్టూగుల్ల పూర్ణిమ సోదరుడు బాలాజీ కుటుంబాన్ని, కవిటంలోని అంతియొక్ చర్చి పాస్టర్ విశ్వనాథం కుటుంబాన్ని పరార్శించారు. పితాని వెంట మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గణపతినీడి రాంబాబు, నాయకులు ఉన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న పితాని సత్యనారాయణ

ప్రభుత్వ పథకాల ద్వారా రూ. ఏడు కోట్ల లబ్ధి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల


పల్లెపాలెం చిన్న గ్రామం అయినప్పటికీ గ్రామస్తులకు ప్రభుత్వ పథకాల ద్వారా రూ.7 కోట్ల లబ్ధి చేకూరిందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పల్లెపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తప్పనిసరిగా ఫ్యాన్ గుర్తుకే ఓటేసి వైసిపిని గెలిపించాలన్నారు. గ్రామంలో సిమెంట్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు బొడ్డు రామకృష్ణ, మండల అధ్యక్షులు గణేశ్న రాంబాబు, కలవపూడి సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స ప్రసాదరాజు, వేగేశ్న బాల గణపతివర్మ, సాగిరాజు హరివర్మ, నాయకులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న పివిఎల్ నరసింహరాజు

ఉపాధ్యాయుల సర్దుబాటు : ఎంఇఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మిగులు ఉపాధ్యాయులు పది మందిని మండలంలో అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేస్తున్నట్లు ఎంఇఒ డి.శారద జ్యోత్స్న తెలిపారు. మంగళవారం ఎంఇఒ కార్యాలయంలో ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ పనిచేసిన ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ ద్వారా మరోచోటకు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. వారిలో పొలమూరు (ఆర్) చేసిన కెవిబి.సత్యనారాయణ బ్రాహ్మణచెరువుకు, మాముడూరు హైస్కూల్లో చేసిన హెచ్‌వి సుబ్బరాజు మాముడూరు (ఆర్)కు, పొలమూరు హైస్కూల్లో చేసిన పార్వతి మాముడూరు చిట్టమట్లగరువుకు, పొలమూరు హైస్కూల్లో చేసిన డిఎన్‌వి సత్యనారాయణ వివిపాలెం (స్పెషల్)కు, పొలమూరు హైస్కూల్‌లో చేసిన ఎన్‌వివి.లక్ష్మి భట్లమగుటూరు (స్పెషల్)కు, పొలమూరు హైస్కూల్‌లో చేసిన కె.నాగదుర్గ పెనుమంట్ర పెద్ద చెరువుగట్టుకు, నత్తా రామేశ్వరం పంపనవారిపాలెంలో చేసిన బింబాధరి భట్లమగుటూరు (యూపీ)కి, సోమరాజు ఇల్లింద్రపర్రు (యుపి)లో చేసిన సతీష్‌కుమార్ నెలమూరు (స్పెషల్)కు, ఆలమూరు హైస్కూల్‌లో చేసిన రసూల్ బేబీ సత్యవరం (యూపీ)కి, మార్టేరు బసంతిదేవి బాలికల హైస్కూల్లో చేసిన టిఎస్‌వివి.లక్ష్మి నెలమూరు (యుపి) స్కూల్‌కు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


బదిలీ పత్రాలు అందజేస్తున్న ఎంఇఒ శారదా జ్యోత్స్న

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈనెల 11వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి తెలిపారు. మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి అప్పలస్వామి తన ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోర్టులో ఉన్న భూ సేకరణకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, కక్షి దారులతో మాట్లాడి రాజీ చేయడానికి కృషి చేయాలని ఆర్‌డిఒ కార్యాలయ అధికారికి సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం చేకూర్చే దిశగా ప్రయత్నించాలన్నారు. ఇప్పటికే పారా లీగల్ వాలంటీర్లు గ్రామాల్లో జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు నగర పంచాయతీ న్యాయ సలహా దారుడు బి.సురేష్ పాల్గొన్నారు.


వీరవాసరంలో లక్ష్మీరాజ్యం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వాసవీమాత ఆలయంలో అన్నదాన సత్రం ప్రారంభం

ప్రజాశక్తి - పెనుగొండ

వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో డిప్యూటీ స్పీకర్ కొల్లగట్ల వీరభద్రస్వామి అన్నదాన సత్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్ర స్వామి మాట్లాడారు. ఆర్యవైశ్యులు ఎక్కుగా వాసవీ మాతను ఆరాధిస్తారని తెలిపారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, అలాగే రాజకీయంలో కూడా ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధ రాఘవయ్య తనయుడు సతీష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ స్పీకర్

కుక్కలకు వ్యాక్సిన్

ప్రజాశక్తి - పాలకోడేరు

పెంపుడు, వీధి కుక్కలకు ర్యాబిస్ వ్యాధి నిర్మూలనా టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి మౌర్య సత్యేంద్ర పిలుపునిచ్చారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాలకోడేరు, విస్సాకోడేరు, మోగల్లు గ్రామాల్లో పెంపుడు, వీధి కుక్కలకు మంగళవారం వ్యాక్సిన్ వేశారు. పాలకోడేరు పశువైద్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు పాల్గొని మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులతోపాటు పంచాయతీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - వీరవాసరం

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ప్రధానోపాధ్యాయిని బి.ప్రభామంజిరి అన్నారు. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయినిగా పనిచేసిన సిహెచ్‌విబి.లక్ష్మీస్వరాజ్యం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు మంగళవారం లక్ష్మీస్వరాజ్యం, శ్రీనివాస్ దంపతులను ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ చుండూరి ముసలయ్య, గుండా రామకృష్ణ, వీరవల్లి రామకృష్ణ, గోదాశి రాంబాబు, జివివి.రామానుజం, కురెళ్ల నరసింహారావు, యుటిఎఫ్ నాయకులు జివి.రమణ, ముద్రగళ శ్రీనివాసరావు, కె.నాగమునేశ్వరరావు, డి.పుల్లారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమవరంలో లిటిల్ ట్విన్స్ స్టూడియో ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో నూతన లిటిల్ ట్విన్స్ స్టూడియోను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు సరికొత్త మోడల్స్‌తో లిటిల్ ట్విన్స్ స్టూడియోను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి స్టూడియో మన ప్రాంతంలో ఉండడం గొప్ప విశేషమన్నారు. నిర్వాహకులు గీత మాట్లాడుతూ చిన్న పిల్లలందరికీ ఇటువంటి మౌల్డింగ్ చేయడం, ఎన్నో రకాల డిజైన్లతో చేస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తోట బోగయ్య, పేరిచర్ల సత్యనారయణ రాజు, కోడే యుగంధర్, మానేపల్లి నాగేశ్వరరావు, సుగాన్ కుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమ స్థాపకులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేవారికి త్వరితగతిన రుణాల మంజూరుకు శ్రద్ధ వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి కోరారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి నిర్ణీత గడువులోగా అనుమతులు, బ్యాంక్ రుణాలను మంజూరు చేయాలన్నారు. పెద్ద పారిశ్రామికవేత్తలకు తక్కువ వ్యవధిలో అన్ని అనుమతులు మంజూరు చేయడంతో పాటు బ్యాంకు రుణాలను కూడా మంజూరు చేస్తున్నారన్నారు. ఇదేవిధంగా ఇతర దరఖాస్తుదారులకు ఎందుకు సకాలంలో అనుమతులు, రుణాలు మంజూరు చేయలేకపోతున్నారని డిఆర్‌ఒ ప్రశ్నించారు. చిన్న, పెద్ద తేడాలేకుండా సకాలంలో రుణాలను మంజూరు చేసి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ప్రమాదకరమైన 45 ఫ్యాక్టరీలను గుర్తించి ఇప్పటికే తనిఖీలను పూర్తి చేశామని, ప్రమాణాలకు అనుగుణంగా లేని వాటికి నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. ప్రమాదం జరిగాక స్పందించడం కంటే ఫ్యాక్టరీలు నిర్ణీత ప్రమాణాలతో కొనసాగుతున్నాయా లేదా అనేది ముందే తనిఖీ చేసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై ఫ్యాక్టరీ యాజమాన్యాలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సింగిల్ డెస్క్ విధానం ద్వారా గత డిసెంబర్ 29 నుండి నేటి వరకు 11 దరఖాస్తులు అందగా వాటిలో ఏడు దరఖాస్తులకు ఇప్పటికే అనుమతులు మంజూరు చేశారని, మిగిలిన దరఖాస్తులు సంబంధిత శాఖల పరిధిలో పరిశీలనలో ఉన్నాయని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి ఉయ్యాల ఆదిశేషు, ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.ఎ.ఖాన్, ఎపిఐఐసి జెడ్ఎం జి.కృష్ణప్రసాద్, ఎపిపిసిబి ఇఇ కె.వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

కమ్ముకున్న మంచు..

వరిపై ప్రభావం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వాతావరణ మార్పులతో మంగళవారం ఉదయం 11 గంటల వరకూ మంచు కమ్మేసింది. అలాగే చలిగాలులు ఎక్కువగా ఉండడంతో జనం వణికిపోతున్నారు. ముఖ్యంగా మార్టేరు, ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు, వెలగలేరు, పొలమూరు, మాముడూరు, సోమరాజు ఇల్లింద్రపర్రుతో పాటు ఆయా గ్రామాల్లో వాతావరణ మార్పుల కారణంగా వరి చేలకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అటు చలి, ఇటు మంచు ప్రభావం ఎక్కువగా ఉండడంతో ముఖ్యంగా వృద్ధులు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో వరికి కాండంతొలుచు పురుగు, పాము పొడ వ్యాపించే అవకాశం ఉందని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచనలు చేస్తున్నారు.


వరిపై మంచు ప్రభావం

వాతావరణంలో మార్పులు

పాలకొల్లు : బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో పాలకొల్లు నియోజకవర్గంలో రెండు రోజులుగా వాతావరణం ఎండ, మబ్బులతో దోబూచులాడుతోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి మబ్బులు పట్టి చలిగాలులు వీస్తున్నాయి. ఒకపక్క వివాహ వేడుకలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

నేరాలు - ఘోరాలు

మున్సిపల్ ఉద్యోగికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆకివీడులో రైలు కిందపడి మృతి చెందిన పాలకొల్లు మున్సిపల్ ఉద్యోగి జామాను దానేశ్వరరావు మృతదేహానికి మంగళవారం పాలకొల్లులో అంత్యక్రియలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టిఆర్ఎస్ శేషాద్రి, మేనేజర్ ముచ్చర్ల ప్రసాద్, ఆర్ఐ అల్లూరి శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరాజు, చందక కుమార్ రాజా మృతుని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

దానేశ్వరావు కుటుంబానికి జెడ్‌పి ఛైర్మన్ పరామర్శ

పాలకొల్లు మున్సిపాల్టీలో సబార్డినేట్‌గా పనిచేస్తూ మృతి చెందిన జామాను దానేశ్వరరావు (డాన్) కుటుంబాన్ని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట పట్టణాధ్యక్షులు చందక సత్తిబాబు, యలకల రంగ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పెనుగొండ

ఆదివారం సిద్ధాంతం గోదావరి బ్రిడ్జి పైనుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆచంట మండలం కొడమంచిలి గ్రామానికి జక్కంశెట్టిపాలెంకు చెందిన జక్కంశెట్టి నాగబాబు (22) ఆదివారం ఇంటి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. సిద్ధాంతం బ్రిడ్జి వద్దకు వచ్చి తండ్రికి ఫోన్ చేసి తాను గోదావరిలోకి దూకి చనిపోతున్నానని చెప్పి గోదారిలోకి దూకాడు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహం లభ్యమైందని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ ఎస్ఎన్‌వివి.రమేష్ తెలిపారు.



యుగంధర్‌ను కలిసిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

నాయీ బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నాయీ బ్రాహ్మణ సంఘం బలోపేతానికి కృషి చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్ సూచించారు. నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు మలువలస రఘు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలో నాయీ బ్రాహ్మణులకు మంచి పేరు ఉందన్నారు. నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి జగనన్న చేదోడు ద్వారా వారికి రూ.పది వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు మలువలస మావుళ్లు, వ్యాపాడ పెద్దిరాజు, సహాయ కార్యదర్శులు సారిక దుర్గారావు, తుంపాల నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన గోస్తనీ తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు శివారు గోస్తనీ నది 92వ తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత గ్రామంలో ఆంజనేయ లక్ష్మణ సమేత సీతారామచంద్ర మహారాజు, పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు పాలకోడేరు, మోగల్లు, భీమవరం ఎఎస్ఆర్ సమితి వారం రోజులుగా ఏర్పాట్లు చేశాయి. యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

IN THE COURT OF THE 4th ADDL. JUNIOR CIVIL JUDGE CUM SPECIAL MOBILE JUDICIAL FIRST CLASS MAGISTRATE AT MACHILIPATNAM
O.S. NO. 293/2020

Between:
Nukala SriRam & another -**Plaintiff**
AND
Kunche Sri Gurunadha Venkata Durga Prasad and others - **Defendants**

To:
14th Defendant:
Sattineni Mutyala Rao, S/o. Nageswara Rao, D.No. 2-194, Komatitippa Village, hamlet of Kasipatnam, Mogalturu Mandal, WG District, JCJC Bhimavaram.

Please take notice that the above suit filed against you all and others for permanent injunction in the above court is posted to 20-02-2023 for your appearance. Appear in person or through Advocate on 20-02-2023 by 10.30AM berore the above court. Else the matter will be decided in your absence.

Machilipatnam, **G.Srinivas**
Date **Advocate for Plaintiff**
Machilipatnam.

Note: you are 14th Respondent in IA.No. 27/2020 filed for temporary injunction and the said IA is also posted to 20-02-2023 for your appearance.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు తాడేపల్లిగూడెం
ఐ.ఎ.నెం. 354/2022
ఇన్ ఓ.ఎస్.నెం. 82/2019

బిట్వీన్:
ఆకుల లక్ష్మీ వగైరాలు **...పిటీషనర్సు /వాదులు**
మరియు
ఆకుల రామకృష్ణ వగైరాలు
...రెస్పాండెంట్సు /ప్రతివాదులు

టు:
1) అచ్చుత రామారావు (ఆర్-6), తండ్రి: గంగారావు, మామిడితోట, తాడేపల్లిగూడెం, టి.పి.జి. పి.జె.సి.జె.
2) అచ్చుత నాగరాజు (ఆర్-7), తండ్రి: రామారావు, (డిటో)
3) గణేశుల దుర్గమ్మ (ఆర్-8), భర్త: కొండబాబు, (డిటో)
4) ఆకుల కొండమ్మ (ఆర్-9), భర్త: నరసింహం, బాదంపూడి, పెంటపాడు మండలం, పి.జె.సి.జె.
5) బోందుల గంగమ్మ (ఆర్-10), భర్త: సత్యనారాయణ, మామిడితోట, గాంధి బొమ్మ సెంటర్, తాడేపల్లిగూడెం, టి.పి.జి. పి.జె.సి.జె.
6) చింతపూడి రాజమ్మ (ఆర్-11), భర్త: సూరిబాబు, (డిటో)

పై నెంబరు గల గ్రంథములో మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపించినప్పటికీ మీరు ఆర్6 టు ఆర్11 రెస్పాండెంట్సు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఇందుమూలముగా మీకు నోటీసులు జారీ చేయడమైనది. ఇందుపై మీకు ఆక్షేపణలుయున్న ఎడల పై కోర్టు వారి సమక్షములో **ది.21-02-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 గంటల నుండి మీరు స్వయంగా గాని, అడ్వకేట ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను.** లేని ఎడల కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

తోట వెంకట సత్యనారాయణ
తాడేపల్లిగూడెం, **వడ్లాని తేజ**
30-1-2023. అడ్వకేట్స్, తాడేపల్లిగూడెం.